# నీటిమీదగీత

శ్రీ పతివాడ సత్యనారాయణ

ఏడిస్తే నిన్నెవరు ఎత్తుకొంటారు
పవ్వళించవోయి బంగారు తండ్రీ
జో-జో-జో

అంటూ "తాయారు" ఉయ్యాలూపుతూ, పాట పాడుతూంది. సుమారు గంటనుంచి కంకపెట్టి ఒకటే ఏడుపు ఏడుస్తూ ఏపనీ చెయ్యనియ్యకుండా, తల్లిని ఏడిపించేస్తున్నాడు పిల్లాడు. తాయారు వేలంతవాడ్ని ఊరుకోబెట్టలేక కొట్టుమిట్టులాడిపోతూంది. కన్ను మూశాడు కదా ని, పాట ఆపు చేసింది...... సరి-మళ్లీ కయ్యమంటూ ఎవరో కొట్టినట్లు ఏడ్వడం మొదలు పెట్టాడు. "అబ్బా, పడుకోరా! నీ మొహం మండ, టికిపాకం పెట్టేస్తున్నావురా-నిద్దరోరా... యీ వేళ ఏమొచ్చి పడిందిరా నీకు" అంటూ లేచినవాడ్ని బోర్లా పడుకోబెట్టి జోకొట్టి, మళ్లీ ఉయ్యాల ఊపడం మొదలెట్టింది. పాటపాడితే గాని పవ్వళించేట్టులేడు. ఆపు జేసినపాట తిరిగి మొదలుపెట్టింది. ఎక్కడాపు చేసిందో, ఎక్కడ మొదలుపెట్టిందో తనకే తెలీదు......

"నా తండ్రి నయనాలు చేరజేసి,
నా బాబు వదనం చంద్రబింబం"

ఇంకా ఊ...ఊ... అంటూనే గతుకులతో ఏడుపురాగం తీస్తూనే ఉన్నాడు. తాయారు మాత్రం పాట ఆపు చేయలే.

"మీ నాన్న పప్పులు పట్టుకొస్తారు
ఏడవకు, ఏడవకు, వెర్రితండ్రి
ఏడిస్తె నిన్నెవరు ఎత్తుకుంటారు"

కుర్రాడి రాగం ఆగిపోయింది. తల్లిపాట ఆగలే. అంతలోనే, ఎవరో తలుపుమీద గట్టిగాకొట్టి గట్టిగా పిల్చినట్టు వినిపించడంతోనే "అబ్బా వీళ్ల నోళ్లు పడిపోను, వీళ్ల చేతులు విరిగిపోను. అంత గట్టిగా తలుపు కొట్టకపోతేను, పిలవకపోతేను, లోనున్న మనుషులు పలకరగామోను" అంటూ తాయారు నసుక్కుంటూ "ఎవరూ? వస్తున్నా అందిగట్టిగా. మళ్లీ "ఏమోవ్..." "అబ్బా! మీరా! వస్తున్నా" అంది; చిన్నంగా నాలిక కొరుక్కుంటూ వెళ్లి తలుపు తీసింది. రంగదాసు లోపలికొస్తూ "ఏమిటేవ్, పిలిచిన గంటసేపటికి గాని ఊడిపడవ్"...

"అబ్బా! అదేమిటండీ ఇప్పుడేగా పిలిచింది. పిలవడమే తరువాయ్. పరుగెత్తుకొచ్చా; ఏమి చిత్రమండి మాట నోటిలోనే ఉందిగా... దానికేంగాని... అంత నోరిచ్చేదేమిటండి భగవంతుడు. ఏం? మీ అమ్మ చిన్నప్పుడు అంగుడు సరిగా ఒత్తలేదా? ఏమిటి? అంత గట్టిగా పిలుస్తారు" అంది తాయారు నవ్వుతూ. "ఏం? మీఅమ్మ చిన్నప్పుడు అంగుడు పూడ్చేసిందేమిటి... అంత కీచుగొంతుతో మాట్లాడుతావు విన బడీ వినబడనట్టు..." అంటూ అందుకున్నాడు రంగదాసు సహజధోరణిలో.

"సరేలెండి... మీ అమ్మను అంటె మా అమ్మను అట్టిపెట్టరుగా!"......

"దానికేం గాని అన్నం అయ్యిందా?"

"అవ్వ కేమవుతుంది... అన్నమయింది కాని ఇంకా వేపుడు చెయ్యాలి... మధ్యాహ్నం చారుంది వేడిచేస్తాలెండి" "ఏడ్చినట్టే వుందే వెంకమ్మా! నీవంట పెంట మీద బోసినట్టు... అన్నం అయిందా? చారు వేడి చేయాలి. ఇంకా వేపుడు చెయ్యాలి!... తెల్లవారుతుందనుకుంటూ... యిప్పటి వరకూ...' ఇంకా రంగదాసు ఏదో అనబోతూంటే తాయారందుకుంది. "ఇప్పటి వరకు కాలు చాపుకొని కూర్చున్నాననుకున్నారేంటి?... అలానే ఉంటుంది. ఊర్మిమీదికి పోయా వాళ్లకి... ఆ చంటివెధవ మధ్యాహ్నమనగా ఏడుపు మొదలెట్టేడు...చంక దిగేవాడు కాదు... పెద్ద పెద్ద బొబ్బలెట్టి ఎవరో కొట్టినట్టు గుక్కపెట్టి మరీ ఏడ్చేవాడు ... వాడిని ఊరుకోబెట్టే టప్పటికి నాతాతలు దిగొచ్చేరు. యీ వేళ వాడికేమొచ్చిందో!... మధ్యాహ్నం వాడు పాలు తాగుతూండగా కంసాలి సుబ్బమ్మ కంటిలో పడ్డాడు... దానికళ్లసలే దిష్టికళ్లు. ఎత్తుకోవద్దంటే మానదు... ఎత్తుకున్నది ఎత్తుకున్నట్టే ఉందా?.... పిల్లాడు వాళ్ళతాత సీతయ్యలాగే బొద్దుగా జమానవుతాడంది... మాసిన ముండలు చూసినట్టుండరు .... అంతే ఏక కింక పెట్టాడు...అయిదు గంటల వేళప్పుడు వీరయ్యతాత దగ్గిరికెళ్లి వీభూది పట్టు[illegible] పెట్టిపడుకోపెట్టా, దాన్తో మీరొచ్చేముందు నిద్దరోయాడు... కూర్చున్నా నా చూడండి...

"సరేలే సోద; చాలా గ్రంథం చెప్పావ్...త్వరగాఆదవంటేదోఏడు..." "అబ్బా వంట అవ్వక ఆగిపోతుందేమిటి! నీళు తోడుపుతా స్నానం కానీయండి. స్నానం అయ్యేలోపులో, వంట ఉండిపోతుందా? అదీ అయిపోతుంది."

రంగదాసు పెరటిలో స్నానానికెళ్లేడు. తాయారు వంటగదిలో చేరుకుంది. వెళ్లిన అయిదు నిమిషాలకే స్నానం చేసి, రంగదాసు తిరిగివచ్చి చావిట్లో పీట వేసుకు కూర్చున్నాడు. ఇంకా తాయారు వేపుతూనే వుంది "ఏమేవ్ యీ వేళ కవ్వదనుకుంటా? తెల్లవారేటట్టుందే."

"అబ్బ అయిపోయింది. ఇంక పది నిమిషాలేనండి" అంటూ లోనుంచి కీచుగొంతుతో సమాధాన మిచ్చింది లోపలేదో సణుక్కుంటూ.

"వేపుళ్లు, గీపుళ్లు నా మొహానికి వద్దుగాని, ఏదో కాస్త పచ్చడి తగలేద్దు...

"అబ్బ ఉపవాసమున్నట్టే మాట్లాడుతారేమండి! మధ్యాహ్నం తినెళ్లేరుగా, మధ్య మధ్య హోటల్లో కాఫీ, ఫలహారాలు కానియ్యకుండా ఉన్నారా?" అంది వేపుడు కళాయి దింపుతూ... "ఆ! తింటున్నాం, తినకేం....వెధవ కబురుచెప్పక ముందేదో చూడు..." అన్నాడు రంగదాసు ఉడుకుమోతులా. అంతలో చంటాడు లేచి రాగం తీయడం మొదలెట్టాడు. "ఇలా ఓసారి ఏడు; ఏడు కూడా లేచాడు..." అన్నాడు దాసు పాతకోపం ఇంకా మింగుతూ.

నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిక్కాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.
పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"
పెరిదేపి-నెల్లూరు జిల్లా.

"ఓసారి ఎత్తుకుందురూ...నా చెయ్యి ఊరుకోలేదుగా...అన్నం వార్చాలి...అదేలా ఉందో తొందర్లో కంగారుగా వార్చాను...." అంటూ లోపలికొచ్చింది.

రంగదాసు ఉయ్యాల్లో పిల్లాడిని ఊపుతూ "అబ్బా ప్రాణాన్కి శాంతి లేదురా, బాబు, ప్రొద్దస్తమానం అక్కడ రెక్కలు కొట్టుకురావడం...సరిగ్గా ఏది కుదరకపోవడం...ఛీ! ఛీ!..."

"ఏమిటండీ; సతాయింపు. నేనుమాత్రం ఇంటిలో కూర్చున్నానేమిటి? చంటిపిల్లాడు ఉన్నయింట్లో సాగనూ సాగదు...అన్నీ కుదరనూ కుదరవు. సర్దుకుపోవాలి కాని... అంత యిదిగా ఉంటే, దాసిదాన్ని కుదర్చలేకపోయారా? సరిగా టైము కన్నీ ఎవుర్చి పెట్టేది...అన్నింటికీ ఒక్కర్తె నే చావాలి... నేను మనిషినా దున్ననా చెప్పండి"

"ఏమిటే నీవెధవ ఆర్గుమెంటు ఊరుకున్న కొద్దీని నీకు తోడు దాసీది కూడా! తినిపెట్టడాన్కి, యీ యింటిలో పదిమందికి పట్టేపనున్నట్టు మాట్లాడుతావేం? దాసీది కూడా వుంటే మీ యిద్దరూ కాళీగా కూర్చుని పచ్చీసు బిల్లాకటె ఛేయించి పెడతా ఆడుకోండి... సిగ్గులేకపోతే సరి కోరికలకి. అదేదో తగలడు... ఇప్పటికే అయిన ఆలస్యం చాలు..." అన్నాడు దాసు ముగిస్తూ... "మీకేమి తింటం లేదులెండి మా వాళ్లిచ్చిన ఎకరం భూమ్మీద పంటే నాకు చాలు... నాఒక్క కడుపుకు చాలదా? పైగా పిల్లాడు మువ్వలూ, కడియాలు చేయించమని మా వాళ్లిచ్చిన ముప్పయి రూపాయలు పులుసులో పడేసారు... పోయిన పండక్కి చీర కొనుక్కోమని మా వాళ్లిచ్చిన పాతిక రూపాలు మీరే మింగేశారు... అన్నీ పోయిన నెల జీతంతో కొనేస్తానన్నారు. పోయిన నెల కాదుకదా... ఈ నెలకూడా దకరా లేదు..." అంటూ ఏడుస్తూ కళ్లు ముక్కు చీరకొంగుతో తుడుచుకుంది తాయారు.

"అదిగో మళ్ళీ మొదలు కనిగొట్లు ఏడుపు... కళ్లకొనల్లోనే ఉంటాయనుకుంటా నీళ్లు మాటంటే చాలు... నాకు తెలియక కడుగుతాను... ఎకరం భూమి, ఆ ఏభైరూపాయలతోనే నీకు గడిచిపోతుందనుకున్నావా?"

"ఏం! మీ చేత్తో చిల్లి యాగాని యొరుగుదునా? నాకొపరాని కొచ్చిందిమొదలు ఇప్పటివరక్కు, కొకగుడ్డ కూడా మీ చేత్తో ఎరగను..." అంది సగం ఏడుపు, సగం కోపంతోను. అదే తడవుగా లోపలికెళ్లింది. తిరిగి వచ్చి అన్నం వడ్డించింది. వడ్డిస్తూండగానే తాయారు వొళ్లు వణికింది. పళ్లెంలో అన్నం ముద్దలా పడింది. దాసు కళ్లు చింతనిప్పుల్లా ఉన్నాయ్... ఒక్కసారి తీక్షణంగా తాయారుకేసి చూశాడు. అన్నంలో చెయ్యిపెట్టి అటుయిటు కెలికేశాడు జావలా వుంది. దాసుకు వళ్లు మండిపోయింది. కోపంతో "నీమొహంమీద పెట్టుకో..." అంటూ బలంకొద్దీ అన్నం పళ్లెం విసిరేశాడు. "కళ్లు లేవ్! మహా పొగరుగా ఉందిలే. అన్నం అంతా జావచేసి నాముందు పెట్టావా? దొడ్డిలో ఉన్న దూడకు పెట్టు దరిద్రపుముండా" అంటూ మీద కెళ్లాడు....అంతటిలోనే పిల్లాడు ఇందంతా వింటున్నానన్నట్లు ఒక్కసారి "అమ్మా" అంటూ ఏడుపు మొదలెట్టాడు...తాయారు సమాధాన మీయలే. చంటాడ్ని చంక నేసుకుంది "వండినన్నం నివ్వే తిను" అంటూ అక్కడున్న వన్నీ తన్నేసి వీథిలోకి నడిచాడు. "అదేమిటండీ! ఒక్క రోజుకి- చంటాడ్ని సర్ది పుచ్చడంలో, దింపడం ఆలస్యమయి, కొంచెం చిమిడింది కోపోమాను-రండి పోశేసుకుంటారేమిటి?" అంటూ నే కూడా వెళ్లింది వీథిలోకి. "ఏడిసేవ్... లోపలకి ఏడుద్దూ..." అంటూ ముందుకు దారితీశాడు. "పోనీలెండి పాపాయమ్మత్తింటిలోంచి అన్నం తీసుకొస్తా" నంది. అదీ వినిపించుకోలే. అప్పటివరకు అంతా వింటున్న ప్రక్కపోర్షనులోని పాపాయమ్మ ఆవిడ మొగుడు తాతయ్య బయటికొచ్చి "రా, నాయనా; మా యింటిలో తిందువు గాని" అంటూ పిలిచారు. "వద్దండీ..." అంటూ ముందుకు నడిచాడు. తాతయ్య వెళ్లి చెయ్యపట్టుకొని "పెద్దాడ్ని చెయ్యి పట్టుకొన్నా రానాయనా" అంటూ వాళ్ల యింటిలోకి తీసుకుపోయాడు.

యిద్దరు మొగుడూ పెళ్లాల బలవంతం మీద రంగదాసు రెండు ముద్దలు తిన్నాడు...తిరిగి యింటిలోకి వచ్చేశాడు...

* * *

రాత్రి తొమ్మిదిగంటలవుతోంది. గదిలో నెమ్మదిగా మాటలు, నవ్వులు వినిపిస్తున్నాయ్. పెద్దపెట్టున రంగదాను తాయారు నవ్వారు. పక్కింటి పాపాయమ్మ "ఏమండోయ్ ఇలా ఓసారి రండి" అంటూ తాతయ్యను పిలిచింది. "ఏమిటేవ్. ఎక్కడ?" అన్నాడు ముసలాడు తడుముకుంటూ. ఇక్కడే నిమ్మళంగా రండి. చూశారా? అప్పుడే దాసు తాయారు ఒకటైపోయి, గదిలో ఎలా కేళీవిలాసంగా ఉన్నారో తెగనవ్వుకుంటున్నారు. దెబ్బలాడినంత సేపు లేదండి."

"ఏం కాలంలో మనం లేమేమిటి! ఆ రోజులు నీకు జ్ఞాపకం లేదనుకుంటా...ఒకటి చెబుతా విను. మొగుడు పెళ్లాల మధ్య వచ్చిన దెబ్బలాట "నీటిమీద గీత" ఉన్నంతసేపు ఉంటుందోయ్ పిల్లా" అంటూ ముసలాడు ముసలమ్మ చెక్కిళ్ల మీద ఇలా అన్నాడు...

"అబ్బా!...మీరు మరీ పడుచుకుర్రాళ్లయిపోతున్నారంటూ..." పాపాయమ్మ మూతి తిప్పింది.

★

అబ్బాయి ఏడుస్తూ పరుగెత్తుకొచ్చాడు. "ఎందుకురా ఏడుస్తున్నా" వని అమ్మ అడిగింది.

"నూతిదగ్గర నాన్న జారిపడ్డాడే" అని ఇంకా వెక్కి వెక్కి ఏడ్చాడు అబ్బాయి.

"నాన్న జారిపడితే నువ్వేడవటమేమిట్రా? నవ్వాలిగాని."

"నవ్వానే-ఏ-ఏ-ఏ" అని జోరెక్కించాడు అబ్బాయి.